క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): కర్నూలు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మున్సిపల్ టౌన్ హాల్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వంద మందికి పైగా పారిశుధ్య కార్మికులకు ఈసీజీ, బీపీ, షుగర్ తదితర రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, మున్సిపల్‌కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప డీఈఓపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): టీచర్లను వేధిస్తున్న కడప జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడుతూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బహిరంగంగానే మహిళా టీచర్లను కించపరచడం, ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నారన్నారు. ఆదర్శంగా ఉండాల్సిన జిల్లా అధికారి విద్యాశాఖకే తలంపులు తెచ్చే విధంగా వ్యవహరించడం విచారకరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, విచారించి డీఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీల తరువాత ఇంకా మూడు వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజాం బేగ్, మౌలాలీ, చంద్రశేఖర్, సుబ్బయ్య, ప్రసాద్, బాలసుబ్బయ్య, నాగేంద్ర కుమార్, దేవేంద్రనాయక్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

శిరివెళ్ల: మండల పరిషత్‌కు నిధులు మంజూరయ్యాయని ఏంపీడీఓ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు రూ.24.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. జనాభా ఆధారంగా తలసరి నిధులు రెండు విడతలు కలిపి రూ.1.84 లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులను మండలంలో వివిధ అభివృద్ధి పనులకు వినియోగిస్తామన్నారు.

దొర్నిపాడు: మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29,34,289 విడుదలైనట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. అమ్మిరెడ్డినగరానికి రూ.67,454, అర్జునాపురం రూ.46,405, బుర్రారెడ్డిపల్లె రూ.2,12,316, చాకరాజువేముల రూ.4,03,426, దొర్నిపాడు రూ.7,25,419, గుండుపాపల రూ.1,74,075, కొండాపురం రూ.1,25,902, క్రిష్టిపాడు రూ.2,28,717, రామచంద్రాపురం రూ.1,92,091, డబ్ల్యూ గోవిందిన్నె రూ.3,93,814, డబ్ల్యూ కొత్తపల్లె రూ.3,64,675 చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో ప్రజల అవసరాల నిమిత్తం ట్యాంకర్‌తో నీటి సరఫరా చేపట్టారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నూర్‌బాషా మాట్లాడుతూ కుందూనదిలో నీరు కలుషితం కావడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుండడంతో చేపలు మృతి చెందాయన్నారు. దీంతో గ్రామస్తుల అవసరాల మేరకు నాలుగు కిలో మీటర్ల దూరంలో పొలంలో ఉన్న ఊటబావి నుంచి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఉయ్యాలవాడ: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాలకు చెందిన శీలం రామిరెడ్డి ఎకరా పొలంలో, సుబ్బనారాయణమ్మ అనే మహిళా రైతు 1.50 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బెర 90, నిమ్మ 110 మొక్కలను ఉపాధి హామీ పథకం కింద నాటినట్లు ఏపీఓ తెలిపారు. మొక్కల సంరక్షణకు నిర్వహణకు అయ్యే ఖర్చులను మూడేళ్ల పాటు ప్రభుత్వం భరిస్తుందన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

● ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



నంద్యాలలో పూజలందుకుంటున్న నీలి వీధిలోని బీబీ ఫాతిమా పీరు



దివిటీల వెలుగులో లాల్‌స్వామి ఊరేగింపు



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని సన్మానిస్తున్న లాల్‌స్వామి కమిటీ సభ్యులు

చాగలమర్రి: మహమ్మద్ ప్రవక్త మనువడు హజ్రత్ ఇమాం హుసేన్ త్యాగానికి ప్రతీకగా మొహర్రం జరుపుకుంటామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం చాగలమర్రిలోని చిన్నమకానంలో ఏర్పాటు చేసిన లాల్ స్వామి పీరును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డిని లాల్‌స్వామి కమిటీ ఉపాధ్యక్షుడు చక్రం షబ్బీర్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా, సంయుక్త కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, కోశాధికారి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ తదితరులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం పాతబస్టాండ్ సమీపంలో వెలసిన హజ్రత్ ఇమాంబాషా పీరును ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక ఫాతేహాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఏపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, కమిటీ సభ్యులు ముల్లా షఫీ, ఎంపీటీసీ సభ్యులు ఫయాజ్, పత్తి నారాయణ, కె.లక్ష్మీరెడ్డి, డైరెక్టర్ ముల్లా జాబీర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి రఫీ, సర్పంచ్ బంగారు షరీఫ్, నాయకులు ఆర్ ఎస్ రమణా, బురాందీన్,రమణ, రామక్రిష్ణ, నరసింహా ఉన్నారు.

భక్తశ్రద్ధలతో రాత్రి సరిగెత్తు

లాల్‌స్వామి రాత్రి సరిగెత్తులో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి వేలాదిగా తరలి వచ్చిన భక్తుల దివిటీల వెలుగులో ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి బిందెలతో నీళ్ల పోసి ఫాతేహాలు సమర్పించి, మొక్కులు చెల్లిస్తారు. కొంత మంది భక్తులు స్వామి ఊరేగింపు ప్రారంభం నుంచి దివిటీలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

ఉయ్యాలవాడ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం పెద్ద సరిగెత్తును ఘనంగా జరుపుకున్నారు. పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కులమతాలకతీతంగా భక్తులు పాల్గొని దస్తగిరి,మౌలాలి స్వామిలకు పీర్లకు ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గోస్పాడు మండలంలో..

గోస్పాడు: మొహర్రం వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఎం.కృష్ణాపురం, యాళ్లూరు, పసురపాడు, కానాలపల్లె, గోస్పాడు తదితర గ్రామాల్లో చావిళ్లలో కొలువుదీరిన పీర్లకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. సరిగెత్తులో భాగంగా ఎం.కృష్ణాపురంలో అల్లా అక్బర్ స్వామి ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నంద్యాలలో..

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో పెద్ద సరిగెత్తు వేడుకలను ముజావర్ల ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీలి వీధిలో వెలసిన బీబీ ఫాతిమా, గాంధీ చౌకులోని హుస్సేన్ ఆలం, జుమ్మా మసీదు వద్ద వెలసిన ఇమాంహుస్సేన్, కల్పనా సెంటర్లో ఇమాంఖాసీం, చాంద్‌బాడలో అలీఅక్బర్, మాల్దార్‌పేటలో మౌలాలి స్వామి, నడిగడ్డలో ఉజలాతాబుజ్, షాదిక్ నగర్‌లో అలీఅక్బర్, నూనెపల్లెలో మౌలాలి స్వామి, ఏకలవ్యనగర్‌లో దస్తగిరి స్వామి పీర్లకు ప్రత్యేకంగా పూల మాలలు, తమలపాకుల దండలు, బాసికాలు, దట్టీలను వేసి మలీదా, చెక్కెర, టెంకాయలను సమర్పించి ఫాతేహాలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పట్టణంలో పెద్ద ఎత్తున పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని చాపిరేవుల, కానాల, అయ్యలూరు, పెద్దకొట్టాల, కొత్తపల్లె, పోలూరు, పులిమద్ది, భీమవరం తదితర గ్రామాల్లో మొహర్రం వేడకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే బంధువులతో కళకళలాడుతున్న గ్రామాలలో సరిగెత్తులు పండుగ వాతావరణాన్ని కల్పించనున్నాయి. చాపిరేవులలో జరుగుతున్న కార్యక్రమంలో అలీ అక్బర్ స్వామి, ఇమాం ఖాసీం(పీర్లు)లను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు.

దొర్నిపాడు: కులమతాలకు అతీతంగా భక్తులు పెద్ద సరిగెతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా చావిళ్లలో కొలువైన పీర్లకు పానకం, చక్కెర, పులగం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న పీర్ల చావిడి వద్ద కుల, మతాలకు అతీతంగా ప్రజలు పీర్ల స్వాములకు ప్రత్యేక పార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు కొండమాయపల్లె, అప్పన పల్లె, ఎల్లావత్తుల, కోటకొండ, తువ్వపల్లె, ఆర్.నాగులవరం, నర్సాపురం, ఆలమూరు, మందలూరు, టీ.లింగందిన్నె, చిలకలూరు తదితర గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించుకున్నారు.



చాగలమర్రిలోని చిన్నమకానంలో కొలువుదీరి భక్తుల పూజలందుకుంటున్న లాల్‌స్వామి



కానాలలో కొలువైన పెద్దస్వామి, హుస్సేన్ స్వామి



గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురంలో అల్లా అక్బర్ స్వామి పీరును ఊరేగిస్తున్న భక్తులు



నంద్యాల మండలం చాపిరేవుల వీధుల్లో పీర్ల గ్రామోత్సవం

అనధికార లేఅవుట్లపై చర్యలు తప్పవు



అనధికార లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

నంద్యాలసిటీ: అనధికార లేఅవుట్లపై త్వరలో చర్యలు తీసుకుంటామని కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ శివారు ప్రాంతాలు రైతునగరం, అయ్యలూరు, కానాల, చాబోలులో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్ యజమానులతో వాటిని అధికారిక లే అవుట్లగా మార్చుకోవాలని సూచించామన్నారు. లేఅవుట్లలో ఉన్న ప్లాట్లను కొనుగోలు చేసేందుకు వచ్చిన వారికి అవగాహన కల్పించామన్నారు. ఆయన వెంట ప్లానింగ్ ఆఫీసర్ సంధ్య ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

● మనజీర్ జిలానీ శామూన్



మొక్కలు నాటుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ దంపతులు

నంద్యాల: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, కలెక్టర్ సతీమణి తమీమ్ అన్సారియాలు మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పచ్చదనం పెంపొందించేందుకు ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సోషల్ ఫారెస్ట్ అధికారులను కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం పెరిగినప్పుడే గాలిలో ఆక్సిజన్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్ర రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు, డీఎఫ్ఓ ఎన్‌డీకే ప్రసాద్, ఎంపీడీవో సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చెవి ఆపరేషన్



ఆపరేషన్ చేయించుకున్న మహిళతో రోటరీ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆపరేషన్‌ను శుక్రవారం స్థానిక తిరుమల పునీత్ ఈఎన్‌టీ హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతూ ఎల్లావత్తుల గ్రామానికి చెందిన నిరుపేద తులశమ్మకు డాక్టర్ అనిల్ ఉచితంగా చెవి ఆపరేషన్‌ను నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు మోహన్‌రెడ్డి, సుధాప్రసాదరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం



మొక్క నాటుతున్న ఎంపీపీ

ఆళ్లగడ్డ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని బాచ్చాపురం ఎంపీపీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రా రెడ్డి హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబూఖాన్, ఎంఈఓ శోభావివేకవతి, ఏపీఓ గణేష్ పాల్గొన్నారు

అటవీ సంపదను కాపాడుకుందాం



4కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

బొమ్మలసత్రం: అటవీ సంపద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా సూచించారు. శుక్రవారం అటవీ శాఖ జిల్లా అధికారి వినీత్ కుమార్ ఆధ్వర్యంలో గ్లోబల్ టైగర్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్కే ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరు కార్యాలయం వరకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన 4కే రన్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం అటవీ సంపదను రక్షించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్ మాట్లాడుతూ పులులను సంరక్షిస్తే అడవులు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో గ్లోబల్ టైగర్ జోన్‌గా నల్లమల అడవులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. పులులను సంరక్షించడంతో పాటు అడవిలో ఉన్న అన్ని జంతువుల సంరక్షణ కోసం చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు యాళ్లూరులో జగనన్న సురక్ష

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిరివెళ్ల: మండల కేంద్రంలోని 4వ సచివాలయం, యర్రగుంట్లలోని 2వ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు.

రేపు చర్చి ప్రారంభోత్సవం

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ క్రైస్ట్ చర్చిని ఈనెల 30న నంద్యాల డయాసిస్ రైట్ రెవరెండ్ డాక్టర్ పుష్పలత(బిషప్) ప్రారంభించనున్నట్లు సంఘపెద్దలు శుక్రవారం తెలిపారు.

సబ్సిడీతో గోధుమ పిండి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఆగస్టు నుంచి గోధుమ పిండిని సబ్సిడీపై అందజేయనున్నట్లు సివిల్ సప్లై కార్యాలయ అధికారి రాముడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలోని రేషన్ కార్డుదారులందరికీ రేషన్ సరుకులతో పాటు కేజీ గోధుమ పిండి రూ.16లకే అందించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పులుల సంరక్షణకు కృషి చేద్దాం

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణ కోసం నల్లమలలో పులల సంరక్షణకు అందరం కృషి చేయాల్సిన అవసరముందని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు అన్నారు. శుక్రవారం బాచేపల్లె, ఆర్‌కృష్ణాపురం, ఆలమూరు గ్రామాల్లో పులుల సంరక్షణ, ప్రాముఖ్యతపై ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అహోబిలం, ఆలమూరు సెక్షన్ల అటవీ అధికారులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరులో శుక్రవారం పక్కిర అనే వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెకు చెందిన పక్కిర కొంత కాలంగా ఆలమూరులో పంట పొలాలకు కాపరిగా ఉంటున్నాడు. దిన చర్యలో భాగంగా పొలం గట్టు వెంట తిరుగుతుండగా పాము కాటు వేసింది. చుట్టు పక్కల రైతులు 108లో చికిత్స నిమిత్తం అతడిదని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వృద్ధుడిపై పిచ్చి కుక్క దాడి

రుద్రవరం: మండల పరిధిలోని ముత్తలూరులో వృద్ధుడు జయరాముడిపై శుక్రవారంపిచ్చి కుక్క దాడి చేసింది. వ్యక్తిగత పనుల నిమిత్తం ప్రధాన రహదారి వెంట కాలినడకన వెళ్తుండగా పిచ్చి కుక్క పరుగున వచ్చి దాడి చేసింది. తీవ్ర గాయం కావడంతో గ్రామస్తులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆలమూరు గ్రామానికి చెందిన ఉషేన్‌బాషా (35) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఈ నెల 24న ఆలమూరు నుంచి కారులో ఆళ్లగడ్డకు బయలుదేరాడు. మార్గమధ్యలో బాచ్చాపురం మెట్ట దాటిన తరువాత ప్రమాదానికి గురై ఉషేన్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న చైర్ పర్సన్

నంద్యాల(సిటీ): ప్రజలందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శుక్రవారం 24వ వార్డులో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 90 శాతం పైగా హామీలను నెరవేర్చిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు 24వ వార్డులో పర్యటించి సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతోనే వార్డు పరిధిలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పాంశావలి, వార్డు కౌన్సిలర్ షేక్‌షెహనాజ్, వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. మున్సిపల్ అధికారులతో కలిసి 29, 35 వార్డుల్లోని షాదిక్ నగర్, కొలిమిపేట, నివర్తిపురం కాలనీలలో పర్యటించారు. మురుగు కాలువలను పరిశీలించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్‌బషీద్, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



శ్రీరంగాపురంలో లబ్ధిదారురాలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

చాగలమర్రి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అన్నారు. శుక్రవారం ముత్యాలపాడు గ్రామంలోని సచివాలయం-1, 2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముత్యాలపాడు సర్పంచ్ శంకరమ్మ, తోడేండ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాముడు, సాగు నీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కార్యక్రమంలో ఏఈలు కొండారెడ్డి, జకరయ్య, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు, ఏఓ రంగ నేతాజీ, వెటర్నరీ వైద్యులు సాయిబాబా, ఏపీఓ నిర్మలాదేవి తదితరులున్నారు.

రుద్రవరం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ముగిసింది. చివరి రోజు శుక్రవారం శ్రీరంగాపురంలో ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, వివిధ శాఖల అధికారులు జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించి పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, ఏపీ ప్రతాప్, మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పాములేటి, నాయకులు మధు, రమణ, పామన్న ఉన్నారు.

ప్రజలను చైతన్యం చేయండి



ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

గోస్పాడు: పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి కుండల్లో నీళ్లను తరచూ ఖాళీ చేయించి వాటిని శుభ్రపరుచుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని, వ్యాధులు దరి చేరవనే విషయాలను తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వరప్రసాద్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించండి

దొర్నిపాడు: రెండు వారాలకోసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ పంచాయతీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల పారిశుధ్యం లోపించి నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అప్రమత్తతో ఉండాలని సూచించారు. తాగునీటి పైపులు లీకేజీ కాకుండా చూసుకోవాలని సూచించారు.